క్లుప్తంగా

భీష్మ ఏకాదశి వేడుకలు రేపు

మాడుగుల రూరల్: కె.జె.పురం సీతారామాలయంలో శనివారం భీష్మ ఏకాదశి వేడుకలు నిర్వహించనున్నట్టు రామాలయం భజన మండలి సభ్యుడు పిళ్లా రాము ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం భజన, సాయంత్రం శ్రీకృష్ణ 108 భక్తి గీతాలను ఆలపిస్తారని, అనంతరం భక్తులకు అల్పాహారం అందిస్తామని పేర్కొన్నారు. భజన భక్తులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ ప్రారంభోత్సవం రేపు



యాగశాలలో పూజలు చేస్తున్న ఆర్య వైశ్యులు

కె.కోటపాడు : కె.కోటపాడులో ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయాన్ని శనివారం ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్టా కార్యక్రమాల్లో భాగంగా గురువారం హోమం చేశారు. అనంతరం గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచగవ్యప్రాశన, రుత్విక్ వరుణ, దీక్షాధారణ, యాగశాల ప్రవేశం, మండపారాధనలు, జలాధివాసం, అగ్నిప్రతిష్టాపన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలంలో పలు గ్రామాలకు చెందిన ఆర్యవైశ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సంతోషిమాత అన్నదాన సత్రానికి విరాళం

మాడుగుల రూరల్: మండలంలో కె.జె.పురం జంక్షన్‌లో నిర్మించిన సంతోషిమాత నిత్యాన్నదాన సత్రానికి దాతలు విరాళం అందిస్తున్నారు. కె.జె.పురం గ్రామానికి చెందిన గూనుపూడి రామన్న కుటుంబ సభ్యులు నాగేశ్వరావు, విఘ్నేశ్వరావు, కుమార్తె గాదం లక్ష్మి రమేశ్ కుటుంబ సభ్యులు రూ.31,423 నగదును గురువారం సాయంత్రం ఆలయ కమిటీ చైర్మన్ కాళ్ల అమ్మతల్లినాయుడుకు అందజేశారు.


ఇసుక తవ్వకాల ప్రాంతం పరిశీలన



ఇసుక తరలించిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ రామారావు

మాకవరపాలెం: ఇసుక తవ్వకాలు చేపడుతున్న ప్రాంతాన్ని ఇన్‌చార్జ్ తహసీల్దార్ రామారావు గురువారం పరిశీలించారు. మండలంలోని జంగాలపల్లిలో సర్పానదిని ఆనుకుని ఉన్న భూముల్లో ఇసుకను రాత్రి వేళల్లో తరలిస్తున్నట్టు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు అందింది. ఈ నేపథ్యంలో గురువారం ఈ ప్రాంతాన్ని తహసీల్దార్ సందర్శించారు. తవ్వకాలకు సంబంధించి వివరాలు తెలుసుకున్నారు. ఇసుకను తరలించకుండా ఉండేందుకు ట్రెంచ్‌లను తవ్వాలని జంగాలపల్లి వీఆర్వో సూర్యనారాయణను ఆదేశించారు.

కాటాల వద్ద ఎండుతున్న చెరకు



ఘాట్‌రోడ్డు కాటా వద్ద ఎండుతున్న చెరకు

మాడుగుల రూరల్: గోవాడ సుగర్ ఫ్యాక్టరీలో ఏర్పడిన సాంకేతిక కారణాలతో ఇటీవల రెండు పర్యాయాలు క్రషింగ్ నిలిచిపోవడంతో కాటాల వద్ద చెరకు నిల్వలు పేరుకుపోతున్నాయి. దీంతో చెరకు ఎండకు ఎండిపోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరకు పర్మిట్లు కాటాల వద్ద మూడు నుంచి నాలుగు రోజుల పాటు తూకం వేయడానికి సమయం పడుతుందని, దీంతో తీవ్రంగా నష్టపోతున్నామని పలువురు రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో కె.జె.పురం, ఘాట్‌రోడ్డు, ఓమ్మలిలో చెరకు కాటాలు ఉన్నాయి. ఈ కాటాల్లో చెరకు బళ్లు నిలిచిపోయాయి. తూకం ఆలస్యం కావడంతో రస నాణ్యత తగ్గిపోయి చెరకు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కాటాల నుంచి చెరకు తరలించడానికి లారీల సంఖ్యను పెంచాలని ఫ్యాక్టరీ యాజమాన్యాన్ని రైతులు కోరుతున్నారు.

బైక్ ఢీకొని ఆలయ అర్చకుడికి తీవ్ర గాయాలు

మాడుగుల రూరల్: ద్విచక్ర వాహనం ఢీకొని ఎం.కోడూరు శ్రీలక్ష్మీనారాయణ స్వామి ఆలయ ప్రధానార్చకుడు పెద్దింటి రాంబాబుకు గురువారం తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మాడుగులలో రాంబాబు నడిచి వెళ్తుండగా ఓ యువకుడు వెనక నుంచి బైక్‌కు బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రాంబాబును స్థానికులు ఇక్కడి ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. వైద్యుడు సంతోష్‌కుమార్ ప్రథమ చికిత్స చేశారు. రాంబాబు తల వెనక భాగంలో మూడు కుట్లు, కాలికి నాలుగు కుట్లు వేశారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం అనకాపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు బైక్‌ను స్వాధీనం చేసుకుని, కేసును దర్యాప్తు చేస్తున్నారు.

అంతటా బాల వికాసం

- సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ప్రత్యేక తరగతులు
- ప్రతి ఆదివారం రెండు గంటల పాటు ఆధ్యాత్మిక బోధన



కె.కోటపాడు రామాలయంలో తండూరార్చన కార్యక్రమంలో పాల్గొన్న బాల వికాస్ విద్యార్థులు



హారతి ఇస్తున్న విద్యార్థులు

కె.కోటపాడు : బాలల వికాసం కోసం సత్యసాయి సేవా సంస్థ విశేష కృషి చేస్తోంది. విద్యార్థులకు ప్రతి ఆదివారం బాల వికాస్ పేరుతో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ వారి ఉన్నతికి పాటు పడుతోంది. పాఠశాలల్లో విద్యార్థులకు బాహ్య విద్య అందుతుంది. అదే బాల వికాస్ తరగతుల ద్వారా అంతర విద్యను అందిస్తున్నారు. ఈ బాల వికాస్ తరగతుల ద్వారా విద్యార్థుల్లో భక్తి భావం పెంపొందించడం, పెద్దలను గౌరవించడం, మంచి అలవాట్లు, నైతికత, క్రమశిక్షణ నేర్పడం చేస్తున్నారు. ప్రస్తుతం విద్యార్థులు సెలవు దినాల్లో సెల్‌ఫోన్‌కు అతుక్కుపోతున్నారు. ఈ అలవాటుతో చిన్నారుల మానసిక ఎదుగుదల దెబ్బతింటుందని బాల వికాస్ గురువులు చెబుతున్నారు. ఈ సమస్యను గుర్తించిన సత్యసాయి సేవా సమితి ప్రతినిధులు విద్యార్థులకు మంచి, చెడును తీసుకునే బాధ్యతను తీసుకుని ప్రతి ఆదివారం రెండు గంటల పాటు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.

ఐదు గ్రామాల్లో బాల వికాస్ తరగతులు

మండలంలో కె.కోటపాడు, లంకవానిపాలెం, కొరువాడ జగన్నాథపురం, కూండ్రపువానిపాలెం, మేడిచర్ల గ్రామాల్లో బాల వికాస్ తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ ఐదు కేంద్రాల్లో 200 మంది విద్యార్థులు హాజరవుతున్నారు. తరగతుల నిర్వహణతో పాటు ఇటీవల తండూరార్చన పూజలను కూడా విద్యార్థులతో నిర్వహించారు. విద్యార్థులకు మంచి-చెడులు, ఆధ్యాత్మిక కార్యక్రమాలపై వ్యాసరచన పోటీలను నిర్వహిస్తూ ప్రోత్సాహక బహుమతులు అందిస్తున్నారు. పిల్లల్లో సత్ప్రవర్తన, ఆధ్యాత్మికతకు పెంపొందేలా బోధన చేస్తున్నారు.

విద్యార్థుల్లో పెరిగిన ఆసక్తి



కె.కోటపాడు రామాలయంలో ప్రతి ఆదివారం బాల వికాస్ తరగతులను నిర్వహిస్తున్నాం. ఎటువంటి లాభాపేక్ష లేకుండా నలుగురు బాల వికాస్ గురువులు బోధిస్తున్నారు. చిన్నారుల వ్యక్తిగత జీవితాలను తీర్చిదిద్ది ముందు తరాలకు ఆధ్యాత్మికత, సనాతన ధర్మాలను తీసుకువెళ్లే వారధులుగా బాల వికాస్ తరగతులు సాగుతున్నాయి. తల్లిదండ్రుల అనుమతితో తరగతులపై ఆసక్తి కలిగేలా చేస్తున్నాం. మంచి లక్షణాలు అలవడేలా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పని చేస్తున్నాం.

– బండారు రామలక్ష్మి, బాల వికాస్ గురువు

కొనసాగుతున్న అనంతేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు



ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న గ్రామస్తులు



పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గణేష్ దంపతులు

నర్సీపట్నం: మండలంలోని చెట్టుపల్లి గ్రామంలో నిర్మించిన ఐశ్వర్యాంబిక సమేత అనంతేశ్వరస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. రెండో రోజు ఆలయ ప్రారంభోత్సవానికి మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్, కళావతి దంపతులు హాజరయ్యారు. గణపతి పూజ, క్షీరాభిషేకం, జలాధివాసం, దన్యాధివాసం, నీరాజనం కార్యక్రమాలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఆధ్మాత్మిక కార్యక్రమాలతో చెట్టుపల్లిలో పండగ వాతావరణం నెలకొంది. శుక్రవారం ఆలయంలో విగ్రహ ప్రతిష్టాపన చేయనున్నారు. ఈ మేరకు గురువారం ఉత్సవ విగ్రహాలను గ్రామ ప్రజలు ఊరేగించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, ఎంపీపీ సుర్ల రాజేశ్వరి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు ఏకా శివ, కౌన్సిలర్ మాకిరెడ్డి బుల్లిదొర, స్థానిక నాయకులు బలరామ్మూర్తి, దన్నిన నానాజీ, రాజారావు, వైస్ ఎంపీపీ తాతబాబు, తదితరులు పాల్గొన్నారు.

9న ఎం.కోడూరు మోదమాంబ తీర్థం

మాడుగుల రూరల్: ఎం.కోడూరు గ్రామ దేవత మోదకొండమ్మ అమ్మవారి తీర్థం ఈ నెల 9న ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి ఉత్తరాంధ్ర మహిళల ఆహ్వాన కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు, సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు తెలిపారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థ బహుమతులుగా రూ.18వేలు, రూ.15వేలు, రూ.12వేలు, రూ.10వేలు చొప్పున అందజేస్తామన్నారు. జిల్లా స్థాయి గుర్రం పోటీలు కూడా నిర్వహించనున్నామని, విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థ బహుమతులుగా రూ.10వేలు, రూ.8వేలు, రూ.6వేలు, రూ.4వేలు చొప్పున అందజేస్తామన్నారు. వీటితో పాటు ఎడ్ల పరుగు పోటీలు, మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించనున్నామన్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన, సాయంత్రం కోలాటం, తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

తామరబ్బ యూపీ స్కూల్‌ను అప్‌గ్రేడ్ చేయాలి



మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు వెంకన్న

దేవరాపల్లి: తామరబ్బ యూపీ స్కూల్‌ను హాస్టల్‌తో కూడిన హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.వెంకన్న, మండల కార్యదర్శి బి.టి.దొర డిమాండ్ చేశారు. దేవరాపల్లిలో గురువారం జరిగిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. తామరబ్బ పంచాయతీలో 9 గిరిజన గ్రామాలు, చింతలపూడి పంచాయతీలో 11 గ్రామాలు ఉన్నాయని, వీటి పరిధిలో 7 ప్రాథమిక, ఒక యూపీ స్కూల్ ఉందన్నారు. హైస్కూల్ లేకపోవడంతో ఐదో తరగతి, ఆపై చదువుల కోసం దూరప్రాంతాలకు వెళ్లలేక పలువురు గిరిజన విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన గ్రామాల్లో అక్షరాస్యతను పెంపొందించేందుకు తామరబ్బలో యూపీ స్కూల్‌ను అప్‌గ్రేడ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు జె.ఈశ్వరరావు, తామర్ల శంకరరావు, వి.దొంగబాబు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో ఈసీసీఈ దినోత్సవం



కె.జె.పురం 1వ అంగన్‌వాడీ కేంద్రంలో మాట్లాడుతున్న కార్యకర్త చంద్ర

మాడుగుల రూరల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో బాల్య సంరక్షణ విద్యా(ఈసీసీఈ) దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. కె.జె.పురం 1వ అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్త పి.చంద్ర మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లల సమగ్ర అభివృద్ధి గురించి తెలుసుకోవడానికి ప్రతి నెలా 5, 6 తేదీల్లో నిర్వహిస్తామన్నారు. మూడు సంవత్సరాల్లోపు పిల్లల్లో మెదడు అభివృద్ధి వేగంగా జరుగుతుందన్నారు. కేంద్రాల్లో నిర్వహించే ప్రీ స్కూల్ కార్యక్రమానికి పిల్లలు హాజరయ్యేటట్లు చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా నూకరత్నం, చిన్నారులు, తల్లులు, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

రెండో రోజు కొనసాగిన నిరసన



నిరసన చేపట్టిన సర్పంచ్‌లతో మాట్లాడుతున్న అసోసియేషన్ ప్రతినిధులు

మాకవరపాలెం: ప్రమాదాలతో పాటు రోడ్లు అధ్వానంగా మారుతున్నాయంటూ బాక్సైట్ లారీలను అడ్డగించి చేపట్టిన నిరసన కొనసాగుతోంది. మండలంలోని శెట్టిపాలెం, భీమబోయినపాలెం, జడ్.గంగవరం సర్పంచ్‌లు అల్లు నామునాయుడు, రుత్తల నందకిషోర్, దుంగల రమణ ఆధ్వర్యంలో బుధవారం బాక్సైట్ ఖనిజాన్ని తరలించే లారీలను అడ్డుకున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా భీమబోయినపాలెం వద్ద వారంతా గురువారం కూడా తమ నిరసన కొనసాగించారు. ఈ నేపథ్యంలో లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు సర్పంచ్‌లతో చర్చలు జరిపారు. లారీల విడిచిపెట్టాలని కోరారు. దీంతో ఖనిజంతో ఉన్న లారీలను రిఫైనరీకి వెళ్లనిచ్చేదిలేదని, కావాలంటే వెనక్కి తీసుకుపోవాలని వారికి స్పష్టం చేశారు. ఖాళీ లారీలను విడిచిపెట్టడంతో అసోసియేషన్ ప్రతినిధులు వెనుదిగారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అడిగర్ల రాంబాబు, స్థానికులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

దేవరాపల్లి: మండలంలోని నాలుగు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని స్థానిక విద్యుత్ శాఖ ఏఈఈ కె.శంకరరావు తెలిపారు. దేవరాపల్లి నుంచి తారువ వెళ్లే ఫీడర్ పరిధిలోని తెనుగుపూడి, వెంకటరాజుపురం, గరిశింగి, చినగంగవరం గ్రామాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. తారువ ఫీడర్‌లో 24 గంటల విద్యుత్ సరఫరాకు సంబంధించిన పనులు చేపడుతున్నామన్నారు. ఆయా గ్రామాల ప్రజలు గమనించాలని కోరారు.

నేటి నుంచి కేశవస్వామి వార్షిక కల్యాణోత్సవాలు



శ్రీదేవి, భూదేవి సమేతుడైన శ్రీకేశవస్వామి

చోడవరం: ప్రాచీన దేవాలయమైన చోడవరం కేశవస్వామివారి వార్షిక కల్యాణోత్సవాలు శుక్రవారం ప్రారంభం కానున్నాయి. వారం రోజుల పాటు జరిగే ఈ వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ, దేవాదాయ శాఖ భారీ ఏర్పాట్లు చేసింది. రాతి మండపాలతో ఉన్న ఈ ఆలయం ఉత్తరాంధ్రలోనే ప్రధాన దేవాలయాల్లో ఒకటిగా పేరొందింది. శ్రీదేవి, భూదేవి సమేతుడైన కేశవస్వామి 752వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం స్వామివారి తిరు వీధోత్సవం, అనంతరం రాత్రి 7 గంటలకు కల్యాణోత్సవం జరగనుంది. 8న ఊంజల సేవ, 9న పండిత సత్కారం, తిరుమల తిరుపతి దేవస్థానం దాస సాహిత్య ప్రాజెక్టు ప్రత్యేక కార్యక్రమాలు, 10న ప్రధాన హోమం, అన్నమాచార్యుల సంకీర్తన కార్యక్రమం, 11న స్వామివారి నాగవల్లి వసంతోత్సవం, 12న పుష్పోత్సవం జరగనుందని ఆలయ ఈవో సత్యనారాయణమూర్తి తెలిపారు.

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి



వసతి గృహంలో పదో తరగతి విద్యార్థులకు సూచనలు చేస్తున్న ఎంఈవో సత్యనారాయణ

కె.కోటపాడు : పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రతి విద్యార్థి ఉత్తమ ఫలితాలు సాధించాలని మండల విద్యాశాఖాధికారి కె.సత్యనారాయణ అన్నారు. మండలంలో ఎ.కోడూరులోని సాంఘిక సంక్షేమ శాఖకు చెందిన సమీకృత వసతి గృహాన్ని గురువారం రాత్రి ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులకు ట్యూటర్‌తో నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను ఆయన పర్యవేక్షించారు. ఈ ఏడాది వసతిగృహం నుంచి పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్న 37 మంది విద్యార్థులు కూడా ఉత్తీర్ణులు కావాలని ఆయన ఆకాంక్షించారు. ఒత్తిడికి లోనుకాకుండా పరీక్షలకు సిద్ధం కావాలన్నారు. ఇప్పటికే పూర్తయిన సిలబస్‌ను రివిజన్ చేయాలని విద్యార్థులకు ఎంఈవో సూచించారు. వసతి గృహ రికార్డులను ఆయన తనిఖీ చేశారు. మెనూ ప్రకారం విద్యార్థులకు రుచికర ఆహారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డెన్ పి.గంగునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

కోళ్ల పౌల్ట్రీల పరిశీలన



బి. సింగవరంలో కోళ్ల ఫారమ్‌ను పరిశీలిస్తున్న పశువైద్యాధికారి గణేశ్

చీడికాడ: పౌల్ట్రీల్లో పెంపకం చేస్తున్న కోళ్లకు ఎటువంటి వైరల్ జబ్బులు సోకకుండా యజమానులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఖండివరం పశువైద్యాధికారి డాక్టర్ ఎ.సి.హెచ్ గణేశ్ సూచించారు. గురువారం సాయంత్రం ఆయన బి.సింగవరంలో కోళ్ల ఫారంను పరిశీలించారు. ఈ సందర్భంగా కోళ్ల ఫారాల యజమానులతో మాట్లాడారు. ఫారాల్లో బ్లీచింగ్ చల్లి పరిశుభ్రంగా ఉంచాలని, మంచినీరు అందించాలని, ఎటువంటి వ్యాధులు సోకకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జైతవరం పశువైద్య సహాయకుడు ఎం.శ్రీనివాసరావు, పౌల్ట్రీ యజమాని శరగడం ధర్మరాజు, తదితరులు పాల్గొన్నారు.

నారాయణరావుకు నివాళి



సంతాప సభలో మాట్లాడుతున్న ఉమాశంకర్‌గణేష

మాకవరపాలెం: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనారిటీ మండల అధ్యక్షుడు కె.నారాయణరావుకు మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ శ్రద్ధాంజలి ఘటించారు. గత నెల 22న రాచపల్లి జంక్షన్ సమీపంలో జరిగిన బైక్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ నారాయణరావు మరణించారు. ఈ నేపథ్యంలో గురువారం తామరంలో జరిగిన సంతాప సభలో ఉమాశంకర్‌గణేష్ పాల్గొని శ్రద్ధాంజలి ఘటించారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ నాయకులు గొంతిన హరిబాబు, చిటికెల రమణ, రుత్తల శ్రీనివాస్, బొడ్డు గోవిందరావు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అడవిరాజులబాబు ఆలయ వార్షికోత్సవం



అడవిరాజులబాబును దర్శించుకుంటున్న మహిళా భక్తులు

నాతవరం: మండల కేంద్రమైన నాతవరం గ్రామస్తులు ఆరాధ దైవంగా పూజించే శెట్టివారి వనంలోని అడవిరాజులబాబు ఆలయ 8వ వార్షికోత్సవం గురువారం వైభవంగా జరిగింది. ఆలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు వేద పండితులు ప్రత్యేక పూజలు చేశారు. శెట్టివారి వనంలో అడవిరాజులబాబులకు రాతి విగ్రహాలు ప్రతిష్ఠించారు. పూర్వం ఇక్కడ తొమ్మిది రకాల చెట్లతో కూడిన వనం ఉండడంతో అడవిరాజులబాబును పూజించేవారు. ప్రతి ఏటా పండగ జరుపుకోవడం ఆనవాయితీ. వేడుకల్లో భాగంగా అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అడవి రాజులబాబులను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మహిళల కోలాటం, భజనలు ఆకట్టుకున్నాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉత్సవ కమిటీ సభ్యులు శెట్టి లోవ, శెట్టి లచ్చబాబు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

రోలుగుంట : మండలంలో గుండుబాడు పంచాయతీ శివారు కశిరెడ్డిపాలెంలో అడవిరాజులబాబు పండగ ఘనంగా జరిగింది. మహిళలు ఉదయం నుంచి సాయంత్రం వరకూ అడవిరాజులబాబును దర్శించుకున్నారు. ఎంపీటీసీ లోవరాజు, మాజీ ఎంపీటీసీ కొండబాబు, మాజీ వైస్ ఎంపీపీ పరిశం లోవరాజు దంపతులు ప్రత్యేక పూజలు చేశారు.

మాకవరపాలెం: మండలంలోని ఎనిమిది గ్రామాల్లో అడవిరాజులబాబు పండగను ఘనంగా నిర్వహించారు. బూరుగపాలెం, బుచ్చన్నపాలెం, పైడిపాల, తాడపాల, తూటిపాల, పాపయ్యపాలెం, పెద్దిపాలెం, చామంతిపురం గ్రామాల్లో ఆలయాలకు చేరుకుని పూజలు చేశారు.

పాకలపాడులో దుర్గమ్మ విగ్రహ ప్రతిష్ట



ఆలయం వద్ద హోమం చేస్తున్న అర్చకులు

గొలుగొండ: పాలకపాడు గ్రామంలో నిర్మించిన కనకదుర్గ ఆలయంలో గురువారం విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామానికి చెందిన పిల్లి చిన్నోడు, లక్ష్మి దంపతులు, గండబోయిన రాము, నూకాలమ్మ దంపతులు ఆర్థిక సహాయంతో ఆలయ నిర్మాణం చేపట్టారు. ఈ మేరకు గురువారం వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ ఆలయ ప్రాణ ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు.

ఘనంగా కోదండ సీతారామాంజనేయ తీర్థం



పూజలు చేస్తున్న సీడీసీ చైర్మన్ శ్రీనివాసరావు

చీడికాడ: ఖండివరంలో కోదండ సీతారామాంజనేయ స్వామి తీర్థం గురువారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి స్వామికి పూజలు, అభిషేకాలు చేశారు. స్వామిని చోడవరం సీడీసీ చైర్మన్ సుంకర శ్రీనివాసరావు, స్థానిక ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు దర్శించుకున్నారు. మధ్యాహ్నం పలు క్రీడా పోటీలు నిర్వహించారు.

రెండు వర్గాల మధ్య స్థల వివాదం

గొలుగొండ: సాలిక మల్లవరం గ్రామంలో భూవివాదం కారణంగా జరిగిన ఘర్షణల్లో రెండు వర్గాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రామారావు తెలిపారు. ఎస్‌ఐ అందించిన వివరాల మేరకు.. సాలికమల్లవరం గ్రామానికి చెందిన మాతే భవాణీ, మాతే గంగరాజు ఇద్దరు ఒకే కుటుంబానికి చెందిన వారు. ఇరువర్గాల మధ్య ఇంటి స్థలం విషయంలో బుధవారం రాత్రి గొడవ జరిగింది. ఇరువర్గాలు కొట్టుకున్నాయి. ఈ మేరకు ఇరువర్గాలు గురువారం గొలుగొండ పోలీసులకు ఫిర్యాదులు చేశాయి. నర్సీపట్నం ఏరియా ఆసుపత్రిలో జాయిన్ కావడంతో రెండు వర్గాల ఇచ్చిన ఫిర్యాదులపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బాలల సత్వర చికిత్స కేంద్రంలో సేవలపై ఆరా



వైద్యులు, వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి పి.షియాజ్ ఖాన్

నర్సీపట్నం: స్థానిక బాలల సత్వర చికిత్స కేంద్రాన్ని సీనియర్ సివిల్ జడ్జి పి.షియాజ్ ఖాన్ గురువారం తనిఖీ చేశారు. కేంద్రంలో దివ్యాంగ పిల్లలకు అందిస్తున్న సేవలపై వైద్యులను ఆరా తీశారు. వైద్య చికిత్సకు అవసరమైన పరికరాలు ఉన్నాయా? లేవా? అని అడిగి తెలుసుకున్నారు. బాలల వైద్యంపై వైద్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. చికిత్స కేంద్రానికి వచ్చే బాలలకు సత్వర వైద్య సేవలు అందుతాయనే భావన తల్లిదండ్రుల్లో కలిగేలా వైద్యులు, వైద్య సిబ్బంది పని చేస్తే బాగుంటుందని సూచించారు.

బోయిలకింతాడలో కిరాణా షాపు దగ్ధం

దేవరాపల్లి: మండలంలోని బోయిలకింతాడలో బుగత రమణమ్మకు చెందిన పాన్ షాపు గురువారం దగ్ధమైంది. షాపులో ఉన్న సామగ్రి కాలి బూడిదైంది. దీంతో సుమారు రూ.50 వేలు ఆస్తి నష్టం జరిగింది. గత 15 ఏళ్ల నుంచి ఈ షాపు నిర్వహిస్తూ ఆమె జీవనం సాగిస్తున్నారు. ఈ ప్రమాదంతో బాధిత కుటుంబం జీవనాధారం కోల్పోయింది. షార్టు సర్క్యూట్ వల్లనే ఈ ప్రమాదం సంభవించి ఉంటుందని బాధితులు చెప్పారు.

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలి




విద్యార్థితో మాట్లాడుతున్న డిప్యూటి డీఈవో అప్పారావు

మాకవరపాలెం: పదిలో ఉత్తమ ఫలితాల సాధనకు విద్యార్థులు కృషి చేయాలని డిప్యూటీ డీఈవో అప్పారావు సూచించారు. మండల కేంద్రంలో గురువారం రాత్రి పదో తరగతి విద్యార్థుల ఇళ్లకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. నిత్యం చదువుతున్నదీ లేనిదీ తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. పది పరీక్షలు పూర్తయ్యే వరకు సమయాన్ని వృథా చేయకుండా దగ్గరుండి చదివించాలని తల్లిదండ్రులకు సూచించారు. ఉపాధ్యాయులు కూడా రాత్రి వేళల్లో పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో పి.ఎస్.ఎన్.మూర్తి, ఉపాధ్యాయుడు తమ్మేష్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

మాకవరపాలెం: రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. మండలంలోని పి.పి.అగ్రహారం గ్రామానికి చెందిన పి.రమణ(45) గురువారం బి.ఎన్.పేట వద్ద బైక్‌పై వెళుతూ అదుపుతప్పి పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో స్థానికులు 108కు సమాచారం ఇవ్వగా మాకవరపాలెంతో పాటు చుట్టుపక్కల మండలాల వాహనాలు అందుబాటులో లేవు. చివరికి ప్రైవేటు వాహనంలో మొదట స్థానిక పీహెచ్‌సీకి, అనంతరం నర్సీపట్నం ఆస్పత్రికి తరలించారు.

బోధనా నైపుణ్యాలు మెరుగుపరుచుకోవాలి



సీఆర్పీ సతీష్‌ను సత్కరిస్తున్న టీచ్ టూల్ కో-ఆర్డినేటర్ నీతిక

రోలుగుంట: ఉపాధ్యాయులు బోధనా నైపుణ్యాలు మెరుగుపరుచుకోవాలని టీచ్ టూల్ జిల్లా కో-ఆర్డినేటర్ నీతిక సూచించారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం టీచ్ టూల్స్ అబ్జర్వర్స్‌తో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. విద్యార్థులకు ఉన్నత విద్యా ప్రమాణాల నైపుణ్యాలు సహాయపడతాయన్నారు. అనంతరం టీచ్ టూల్స్ అబ్జర్వేషన్స్‌లో జిల్లా స్థాయిలో అధికంగా చేసిన రోలుగుంట స్కూల్ కాంప్లెక్సు క్లస్టర్ రిసోర్స్ పర్సన్ పి.సతీష్‌ను ఆమె సత్కరించారు. ఎంఈవోలు జానుప్రసాద్, పి.జగ్గారావు, మండలంలో గల కుసుర్లపూడి, జె.నాయుడుపాలెం, బుచ్చింపేట, రోలుగుంట క్లస్టర్ హెచ్‌ఎంలు శెట్టిమోహన్, దాడిశెట్టి రమేష్ కుమార్, డి.ఎస్.ఎస్.వి.ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.